క్లుప్తంగా

తూటికాడ కషాయం తయారీపై అవగాహన



తూటికాడ కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు పుర్లి లక్ష్మునాయుడు, రమణ తూటికాడ కషాయం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. రైతుల సమక్షంలో తూటి ఆకులతో కషాయాన్ని తయారు చేసి, దాన్ని పంటలకు వినియోగించే విధానాన్ని వివరించా రు. పంటలను ఆశించే సుడిదోమను ఈ కషాయంతో నివారించవచ్చని చెప్పా రు. ఎంపీటీసీ గౌరు నాయుడు, సర్పంచ్ భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయవద్దు



సంకిలిలో కుళాయిలను పరిశీలిస్తున్న జేఈ శ్రీచరణ్

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ అన్నా రు. మండలంలోని సంకిలి, బొడ్డవలస, ఉంగ రాడ గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను పరిశీలిం చారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. కుళాయిల పనితీరుపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని, సమస్య ఉన్న ప్రాంతాల వివరాలను తమకు తెలియజేయాలని చెప్పారు. చిన్నచిన్న మరమ్మతులైతే పంచాయతీ కార్యదర్శులు వెంటనే బాగుచేసేలా చూడాలని కోరారు. జేఈ వెంట సంకిలి సర్పంచ్ బుడుమూరు పట్టాభి, తదితరులు ఉన్నారు.

రైతులను మోసగిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఓ కన్నబాబు

వంగర: ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాల్లో రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ తట్టికోట కన్నబాబు ఎరువుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. అరసాడ గ్రామంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం ఆయన తనిఖీలు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు.ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని, ప్రతీ కొనుగోలుకు సంబంధించి రైతులకు బిల్లులు ఇవ్వాలని దుకాణాల యజమానులకు సూచించారు.

ఘనంగా చర్చి రజతోత్సవం



ఏసు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్లు



చర్చిలో ప్రతిష్ఠించిన బాలయేసు విగ్రహం

బాడంగి: ముగడ గ్రామంలోని బాల యేసు దేవాలయం రజతోత్సవాలను ఆ గ్రామ సంఘస్తులు, పెద్దలు, ఇన్‌ఫ్రంట్ జీసస్ యువ త ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చర్చి విచారణకర్త ఫాదర్ సీహెచ్.సురేష్ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లు ఏసు సందేశాన్ని వినిపించారు.ఆ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ పెంకి సుశీల,జీవరత్నం దంపతులు సౌజన్యంతో బాలయేసు ప్రతిమను ఆలయప్రాంగణంలో ప్రతిష్ఠించారు. వేడుకల్లో భాగంగా అన్నదానం చేశారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మెంటాడ: మండలంలోని బిరసాడవలస గ్రామాన్ని ఆనుకుని ఉన్న కోళ్ల ఫారాన్ని తక్షణమే తరలించాలని కోరుతూ ఆ గ్రామస్తులు కోళ్ల ఫారం ఎదుటు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు అయిదో రోజు సోమవారం కొనసాగాయి. వీరికి పలు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మద్దతుగా నిలిచి సంఘీభావం తెలుపుతున్నారు. నాలుగో రోజు ఆదివారం నిరాహార దీక్ష శిబిరానికి ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. తక్షణమే కోళ్ల ఫారాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు, జనసేన నాయకులు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నా రు.

పశుగ్రాస విత్తనాల జాడేది ...?

- పాడి రైతులకు రాయితీపై అందని పశుగ్రాస విత్తనాలు
- పశువుల పెంపకందారులకు తప్పని ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో ఠంఛన్‌గా అందిన విత్తనాలు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిచిపోయిన పంపిణీ
- పశుగ్రాస విత్తనాలు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం



కొఠారిపురం వద్ద సాగులో ఉన్న పశుగ్రాసం

రాజాం: పశువుల పోషణ రైతుకు పెనుభారమవుతోంది. కూటమి ప్రభుత్వం పశుగ్రాస విత్తనాలు కూడా అందించలేని దుస్థితిలో ఉంది. వర్షాకాలంలో పాడి పశువుల పెంపకందారులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో పశుగ్రాసం కొరత ఒకటి. ఏటా వర్షాకాలం ఆరంభ సమయంలో గత ప్రభుత్వాలు రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందించేవి. వీటిని పాడిరైతులు 10 నుంచి 20 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసి పశుగ్రాసం కొరతను అధిగమించేవారు. మేలు రకం పశుగ్రాసాన్ని సాగు చేసి పాల ఉత్పత్తి పెంచుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాయితీపై విత్తనాల పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది.

గతంలో 70 శాతం రాయితీపై అందజేత

గత ప్రభుత్వంలో పాడిరైతులకు రైతు సేవా కేంద్రాలు, పశు వైద్యకేంద్రాల్లో పశుగ్రాస విత్తనాలతో పాటు నిల్వచేసిన పశుగ్రాసం అందేది. 70 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు లభించేవి. పాడి రైతులు కిలో విత్తనాలను రాయితీ పోనూ రూ.23కే కొనుగోలుచేసి వీటిని తమ పొలంలో 10 సెంట్ల విస్తీర్ణంలో జల్లితే అయిదు నుంచి ఎనిమిది పర్యాయాలు గడ్డి కోతకు వచ్చేది. దీంతో పశుగ్రాసం చింతలేకుండా వర్షా కాలం ఒడ్డెక్కేది. ఖరీఫ్ అనంతరం వరి పంటను ఎక్కువగా రైతులు యంత్రాలతో నూర్పిడి చేస్తుండడం వల్ల వరి పనలు మెత్తగా నలిగిపో యి చిత్తుబొత్తుగా మారిపోతోంది. దీంతో ఆ గడ్డిని పశువులు పెద్దగా తినడం లేదు. ప్రత్యామ్నాయంగా రైతులు పచ్చిగడ్డిపై దృష్టిసారించాల్సి వస్తోంది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పొలాల గట్లన్నీ బురదగా మారడంతో పాటు ఖరీఫ్ పనులు ప్రారంభం కావ డం వల్ల గట్లను రైతులు పటిష్టం చేస్తుండడంతో గట్లపై ఉండే గడ్డిని తవ్వుకునేందుకు, కోత చేసేందుకు వీలుకావడం లేదు. ఫలితంగా పశువులకు గడ్డి కొరత ఏర్పడింది.

ఏక, బహు వార్షిక రకాలు పంపిణీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాడిరైతులకు చాలా రకాల విత్తనాలు రైతులకు పంపిణీ చేసేది.ఏక వార్షికాలు, బహువార్షికాలు, పశుగ్రాస చెట్లు అనే రకాలను అందుబాటులో ఉంచేది.ఇందులో ఏకవార్షిక రకాల్లో ఎస్ఎస్‌జీ జొన్న, మొక్క జొన్న, సజ్జ, లూసర్న్, అలసంద, పిల్లిపెసర, జనుమ పంటలు ఉన్నాయి. ఇవి మొదటి దఫకోత 60 రోజులకు వచ్చి ఎకరానికి 30 నుంచి 35 టన్నుల దిగుబడి వచ్చేది. మూడు కోతలు వరకూ గడ్డి ఉత్పత్తి ఉండేది. బహువార్షికాలు మూడు సంవత్సరాల పంటలు. హైబ్రీడ్ నేపియర్, కో-1, కో-2, కో-3, సూపర్ నేపియర్, పారా గడ్డి, గినిగడ్డి, స్లైలో హేమాట రకాలు వంటి విత్తనాలు ఉండేవి. ఈరకాలు 70 రోజులకు కోతకు వచ్చేవి. ఎకరానికి 70 నుంచి 80 టన్నుల దిగుబడి ఉండేది. పశుగ్రాసం చెట్ల రకం విత్తనాలను కూడా పంపిణీ చేసే వారు. ఈ రకాలు 60 నుంచి 75 రోజుల కాల వ్యవధిలో లేదా ప్రతీ 40 రోజులకు ఒకసారి చొప్పున, సంవత్సరానికి 5 నుంచి 6 కోతలు వస్తాయి. 30 నుంచి 35 టన్నుల దిగుబడి వచ్చేది. ఈ విత్తనాలు టన్ను వరకూ రాజాం నియోజకవర్గంలో ఖరీఫ్ ప్రారంభ సమయంలో రైతులకు అందుబాటులో ఉంచేవారు. ఇవి కాకుండా నిల్వ పచ్చగడ్డి విక్రయాలు జరిగేవి. ఇవన్నీ ప్రస్తుతం కనుమరుగయ్యాయి.

రాయితీపై అందించే వారు

గతంలో పశుగ్రాస విత్తనాలు రాయితీపై పంపిణీ చేసే వారు. నాలుగు కిలోల విత్తనాలు తీసుకుని సాగు చేస్తే ఉత్పత్తి అయ్యే పశుగ్రాసం ఏడాది మొత్తం సరిపోయేది. ప్రస్తుతం ఈ ఏడాది ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేయలేదు.ప్రైవేటున కొనుగోలు చేసుకుంటున్నారు.

– ఆర్. సన్యాసప్పుడు, రైతు, కొఠారిపురం, రాజాం మండలం

పశుగ్రాసానికి ఇబ్బందులు

గతంలో పశుగ్రాసానికి ఇబ్బందులు ఉండేవికాదు. చాలా రకాల విత్తనాలతో పాటు పశుగ్రాసం పంపిణీ ఉండేది. ఇప్పుడు చాలా అవస్థలు పడుతున్నాం. పశుగ్రాసం నిమిత్తం పొలాల గట్లలో తిరగాల్సి వస్తుంది.వర్షాకాలంలో ఈగడ్డి లభించడం చాలా కష్టం.

– బి.కన్నయ్య, రైతు, వంగర

ప్రతిపాదనలు పంపించాం..

ప్రతీ ఏడాది పశుగ్రాస విత్తనాల పంపిణీ ఉంటుంది. ఈఏడాది కూడా ప్రతిపాదనలు పంపించాం. విత్తనాలు వచ్చిన వెంటనే పంపిణీ ప్రారంభిస్తాం. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

– బి.జయప్రకాష్, పశుసంవర్ధక శాఖ ఏడీఏ, రాజాం

ఆహ్లాదకర ప్రయాణం...



రాజాం- రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో తెర్లాం మండలం కూనాయవలస నుంచి డి.గదబవలస వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తురాయి చెట్లు ఎర్రటి పూలతో ఆకట్టుకుంటున్నాయి. విరగబూసిన పూలతో చెట్లు అందంగా కనిపిస్తుం డడంతో వేసవి ఎండల తీవ్రత ఉన్నప్పటికీ ఈ రోడ్డులో ప్రయాణం ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. – తెర్లాం

ఇది వీధి రోడ్డే..



చిత్రంలో కనిపిస్తుంది కాలువ అనుకుంటే పొరపాటు పడ్డట్టే. రాజాం పట్టణ పరిధి బాబానగర్ రోడ్డు. పక్కనే ఉన్న కాలువలో నుంచి మురుగునీరు పొంగి ఇలా రోడ్డుపై ప్రవహిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోందని, ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో రోగాలబారిన పడే ప్రమాదం ఉందని, కాలనీ వాసు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నడిచి వెళ్లలేకపోతున్నామని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – రాజాం సిటీ

పని చేయని ఏటీఎంలు



రాజాం పట్టణంలోని పాలకొండ రోడ్డులో పలుచోట్ల ఎస్‌బీఐ ఏటీఎంలు ఆరునెలలుగా పనిచేయడంలేదు. దీంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకొండరోడ్డులో లక్కీ షాపింగ్‌మాల్ దగ్గర్లో ఉన్న రెండు ఏటీఎం కేంద్రాల్లో ఒక్కటి కూడా పనిచేయడం లేదు. బొబ్బిలి జంక్షన్ వద్ద ఉన్న ఏటీఎం కేంద్రానిదీ ఇదే పరిస్థితి. ఎస్‌బీఐ అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ఖాతాదారుల కోరుతున్నారు. – రాజాం

మోడల్ ప్రైమరీ స్కూళ్లకు నూతన హెచ్‌ఎంలు

బాడంగి: మండలంలోని మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్‌ఎంలుగా స్కూల్ సహాయకులను నియమిస్తూ డీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని ఎంఈఓ రాజ్యలక్ష్మి సోమవారం తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో ఏడు మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఉండగా, ఆరు పాఠశాలలకు నూతన హెచ్‌ఎంలను నియమించినట్టు చెప్పారు. బాడంగి పాఠశాల హెచ్‌ఎంగా కల్లూరి సింహాచలం, కోడూరు పాఠశాల హెచ్‌ఎంగా శిరోమణి, రేజేరు పాఠశాల హెచ్‌ఎంగా పి.గౌరీరాజు, గజరాయునివలస పాఠశాల హెచ్‌ఎంగా ఏ.చిన్నారావు, గొల్లాది పాఠశాల హెచ్‌ఎంగా ఎం.అప్పారావు, వాడాడ పాఠశాల హెచ్‌ఎంగా బి.సీతంనాయుడును నియమించినట్టు చెప్పారు. వీరిలో కొంతమంది ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారని తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



తాటిపాడు ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛదూత్ మండల కో- ఆర్డినేటర్ పద్మ, తదితరులు

రేగిడి: ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ సంచుల వినియోగాన్ని తగ్గించాలని స్వచ్ఛదూత్ మండల కో- ఆర్డినేటర్ కడగల పద్మ ప్రజలకు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాటిపాడు గ్రామంలో సోమవారం ప్రజలకు తాగునీరు, విద్యుత్ ఆదా చేయడంతో పాటు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటుందని, ప్రమాదకర రోగాలు వ్యాపిస్తాయని అన్నారు.అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి ఎం. చిన్నారావు, గ్రామస్తులు రామినాయుడు, శ్రీరాములు ఉన్నారు.

గోతులు పూడ్చండి మహా ప్రభో..



తెర్లాం-బొబ్బిలి రోడ్డులో తెర్లాం రామమందిరం వద్ద ఏర్పడిన గోతులు

తెర్లాం: మండల కేంద్రం తెర్లాంలో నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డులో రామమందిరం మలుపు వద్ద పెద్ద పెద్ద గోతులు తేలడంతో స్థానికులు, ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెర్లాం నుంచి బొబ్బిలి, బొబ్బిలి నుంచి తెర్లాం మీదుగా రాజాం రోజూ వందల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో వెళ్తుంటాయి.రామమందిరం వద్ద మలుపు వద్ద గోతుల్లో నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లలేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో రామమందిరానికి భక్తులు వెళ్లే భక్తులకు అవస్థలు తప్పడం లేదు. గోతులు పూడ్చమని ఎన్ని సార్లు వేడుకుంటున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులతో పాటు ఆమార్గంలో ప్రయాణించే వారు కోరుతున్నారు.

జీవితంలో యోగా ఓ భాగం కావాలి



రాజాం సిటీ: రాజాం పట్టణంలో మానవహారంగా ఏర్పడిన అధికారులు, వివిధ శాఖల సిబ్బంది

యోగాతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, ప్రతీ ఒక్కరి నిత్య జీవితంలో యోగా ఓ భాగం కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పట్టణాలు, మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో అధికారు ల ఆధ్వర్యంలో సోమవారం యోగా సాధనతో పాటు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అధికారులు, వివిధ శాఖల సిబ్బంది మానవహారాలుగా ఏర్పాటయ్యారు. యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, ఒత్తిడిని అధిగమించవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని అధికారులు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: తెర్లాంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, వివిధ శాఖల సిబ్బంది



బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, స్థానికులు



రేగిడి: ఖండ్యాం గ్రామంలో ర్యాలీ చేస్తున్న అధికారులు



వంగర: ఎం.సీతారాంపురంలో ర్యాలీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు,స్థానికులు



రామభద్రపురం: రామభద్రపురంలో ర్యాలీ చేస్తున్న అధికారులు,నాయుకులు



బాడంగి: బాడంగిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, వివిధ శాఖల సిబ్బంది



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని కుమ్మరి వీధిలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ, వేదికపై ఎంపీపీ జ్ఞానదీపిక, తదితరులు

గజపతినగరం: స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్‌లో భాగంగా 2047నాటికి తలసరి ఆదాయం 15శాతం పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఆదిశగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీళా గాంధీ అన్నారు. గజపతినగరంలోని గ్రామ సచివాలయం-2 పై అంతస్తులో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర -2047 విజన్ ప్లాన్ యూనిట్‌ను ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపికతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలు సాగు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహణ సదస్సులు నిర్వహించి రైతులను చైతన్యవంతం చేయాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని, ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న డ్రిప్ ఇరిగేషన్, యంత్రపరికాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, అరటి, బొప్పాయి, జామ, కొబ్బరి వంటి పంటలను సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతుల కు ప్రభుత్వం ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలు అందిస్తుందని వివరించారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

వంగర: ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష పథకంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యాధికారి సీహెచ్.జ్యోతి సోమవారం వైద్యపరీక్షలు చేశారు. బరువు, ఎత్తు పరిశీలించారు. ఉచితంగా మందులు అందజేసి పలు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. విధిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, రక్త హీనత సమస్య తలెత్తదని చెప్పారు. క్రమం తప్పకుండా వైద్యతనిఖీలు చేయించుకోవాలని, బీపీ, ఎప్పటికప్పుడు బరువు పరీక్షించుకోవాలని, వైద్యుల సలహాలను పాటించాలని చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా

రామభద్రపురం: మండలంలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురు వ్యక్తులకు సాలూరు కోర్టు జడ్జి హర్షవర్ధన్ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారని ఎస్ఐ వి.ప్రసాదరావు సోమవారం తెలిపారు. గరివిడి మండలం దువ్వాం గ్రామానికి చెందిన వ్యక్తి, కాకినాడకు చెందిన వ్యక్తి, దత్తిరాజేరు మండలం కె.కృష్ణాపురం గ్రామానికి చెందిన వ్యక్తి, అదే మండలం గడసాం గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు. వారికి సాలూరు కోర్టు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని చెప్పారు.